

ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం ఆత్మ గౌరవం కాపాడుకునే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. - IIలో



ధ్రువపత్రం..ఉపయోగకరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జారీ చేసిన ధ్రువపత్రాలతో పేదలకు మేలు చేకూరింది. - IIలో



16న గంగవరంలో శ్రీవారి కల్యాణం

గంగవరంలో ఈ నెల 16వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే వెంకటేగౌడ పరిశీలించారు. - IIలో

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటు నమోదు ప్రక్రియ

బంగారుపాళెం: ఓటు నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం బంగారుపాళెం రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పులకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ తదితర అంశాలు పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఈ నెల 9వ తేదీ వరకు అందిన ఫారం 6,7, 8 దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో క్షుణంగా పరిశీలించారా? లేదా అని ఆరా తీశారు. సక్రమంగా ఉన్న దరఖాస్తులను ఆమోదించి అప్‌లోడ్ చేయాలన్నారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్ అధికారులు సమన్వయంతో పనిచేసి తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల



మాట్లాడుతున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2024 సంవత్సరం జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు డీఆర్వో రాజశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ఫారాలకు సంబంధించి డిసెంబర్ 9వ తేదీ వరకు 89,299 దరఖాస్తులు నమోదైనట్లు చెప్పారు. ఆ దరఖాస్తులను 26వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఓటరు ఎపిక్ కార్డులు సంబంధిత ఓటరు చిరునామాకు నేరుగా పోస్టల్ ద్వారా చేరుతాయన్నారు. ఈ సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు భాస్కర్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, ఉదయ్‌కుమార్, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


14,15 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 14,15 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపిక చేసిన 136 పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 14వ తేదీన 68 పాఠశాలలకు, 15వ తేదీన 68 పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపిక చేసిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర వివరాలకు 9440757761 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ కోరారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలో పలువురికి పార్టీ పదవులు ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జులను నియమించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఎస్.చక్రధర్‌ను చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా, తిరుపతి జిల్లాకు చెందిన ఎల్.రాజశేఖర్‌రెడ్డిని కర్నూలు, అన్నమయ్య జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా, పల్నాడు జిల్లాకు చెందిన జి.మనోహర్‌యాదవ్‌ను పల్నాడు, బాపట్ల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నియమించారు. కార్యదర్శులుగా ఎం.మణికంఠ(తిరుపతి జిల్లా), వి.ధరణీష్‌రెడ్డి(చిత్తూరు జిల్లా), సంయుక్త కార్యదర్శులుగా పి.సదాశివ(తిరుపతి జిల్లా), ఎస్.హేమంత్(చిత్తూరు జిల్లా)ను నియమించారు.

ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్‌గా సుదర్శన్



చిత్తూరు రూరల్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా సుదర్శన్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వరులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆర్బీఎస్‌కే కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. జిల్లా వర్గీకరణలో భాగంగా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవల అమలులో ప్రభుత్వం ఆశయం మేరకు పనిచేస్తానని చెప్పారు. సేవల అందే విషయంలో సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.

శుభస్వాగతం.. సాదర వీడ్కోలు

- తిరుపతికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆత్మీయ ఆహ్వానం పలికిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

రేణిగుంట : తిరుపతిలో ఓ శుభ కార్యానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు. బుధవారం సాయంత్రం 4.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వెంట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రికి ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిశాంత్ రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. తిరుపతి పర్యటన అనంతరం 5.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరారు. ఆయనకు మంత్రులు, ప్రజాప్రతిధులు, అధికారులు సాదరంగా వీడ్కోలు పలికారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి ఆర్‌కే రోజా, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

ఆటాడుదాం..రారండి!

నిద్ర లేవగానే పనిలోకి వెళ్లడం.. ఒత్తిడితో అల్పాహారం సైతం హడావుడిగా తినడమే తరువాయి.. మళ్లీ పనిలో మునిగిపోవడం.. పొద్దు పోయేసరికి అలిసి సొలసి వచ్చి, సేద తీరడం ఇదీ నేటి ఆధునిక జీవనం.. ఫలితం మానసికోల్లాసం కరువు. దీనికి చెక్‌పెడుతూ గ్రామీణ ప్రజానీకానికి మానసికోల్లాసం కలిగించడంతోపాటు, వారిలో క్రీడా నైపుణ్యం వెలికితీయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. దీనిపై ప్రత్యేక కథనం.

- ఆడుదాం..ఆంధ్రా పోటీలకు 1.75 లక్షల మంది రిజిస్ట్రేషన్
- సచివాలయాలకు చేరిన క్రీడా సామగ్రి
- పోటీలకు మైదానాలు సిద్ధం
- 612 సచివాలయాలు, 111 వార్డుల్లో ఏర్పాట్లు పూర్తి



ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రిని అందజేస్తున్న అధికారులు, నాయకులు (ఫైల్)

సాక్షి, చిత్తూరు: గ్రామీణ స్థాయిలో యువతలో క్రీడా వికాసాన్ని కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడా పోటీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఇందుకోసం 1.75 లక్షల మందికి పైగా క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఐదు క్రీడలకు సంబంధించి భారీ స్థాయిలో పేర్లు నమోదు అయ్యాయి. సుమారు 51 రోజులపాటు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మొత్తం 1,75,949 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో పురుషులు 1,13,550, మహిళలు 53,334 మంది ఉన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే సచివాలయాలకు క్రీడా సామగ్రి చేరింది.

612 సచివాలయాల పరిధిలో పోటీలు

జిల్లా వ్యాప్తంగా 612 సచివాలయాల పరిధిలో పురుషులు, మహిళలను వేర్వేరు జట్లుగా విభజించి, ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాలీబాల్ జట్టులో 12 మంది, కబడ్డీ జట్టులో 12 మంది, ఖోఖో జట్టులో 15 మంది, క్రికెట్ జట్టులో 16 మంది, బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

ప్రజలకూ భాగస్వామ్యం

ఈ క్రీడలను గ్రామీణ స్థాయిలో నిర్వహించేందుకు ప్రజల భాగస్వామ్యం కూడా కల్పించేందుకు రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. గ్రామీణ స్థాయిలో ఆడే క్రీడాకారులు స్థానికుడై ఉండాలని ఆధార్ కార్డు, పుట్టిన తేదీలు కచ్చితంగా ఉండేటట్లు ధ్రువీకరణ పత్రాలు ఉండాలని నిబంధన పెట్టారు. కనిష్ఠ వయస్సు 15 ఏళ్ల ఆ తర్వాత గరిష్ఠ వయోపరిమితి లేకుండా ఈ క్రీడలను నిర్వహించనున్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వారి నంబర్లను గ్రూప్ చేసి, ఆయా గ్రూపుల వారీగా క్రీడా పోటీల సమయం, తేదీలను వారికి ఆ గ్రూపులో తెలియజేస్తారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారు. పరిశీలించేందుకు హెడ్మాస్టర్లు, ఎంఈఓలు, ఈఓపీఆర్డీలు ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు ఉంటారు.

రూ.లక్షల్లో నగదు బహుమతులు

మొదటి బహుమతి నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ. 5లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

15 నుంచి పోటీలు...

జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ క్రీడా పోటీలు సచివాలయ స్థాయిలో జనవరి 1 తేదీ వరకు, మండలస్థాయిలో జనవరి 2 నుంచి 15వ తేదీ వరకు, నియోజకవర్గస్థాయిలో జనవరి 16 నుంచి 21వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో జనవరి 22 నుంచి 28వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి ఆయా సచివాలయ పరిధిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి తేదీలు, సమయం తదితర వివరాలు అందజేశారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్రీడా నైపుణ్యం పెంపునకే పోటీలు



ప్రజల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. జిల్లాస్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసింది. క్రీడల మైదానాలతోపాటు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. క్రీడా సామగ్రి ఇప్పటికే సచివాలయాలకు చేరాయి. ప్రజలు ఆయా సచివాలయ పరిధిలో పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. బహుమతులను రెండు తరగతులుగా విభజించి అందజేయనున్నారు. గ్రామీణ ప్రజలు క్రీడాకారులుగా రాణించేందుకు ఈ ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఎంతగానో ఉపకరిస్తాయి.

– సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్

భారీగా రిజిస్ట్రేషన్లు



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న క్రీడా పోటీలకు సచివాలయాలు మొదటి దశలో వేదికలు కానున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారు. బహుమతులు కూడా ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. క్రీడా నైపుణ్యం పెంపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

– బాలాజీ, జిల్లా క్రీడాధికారి, చిత్తూరు

పోటీలకు సర్వం సిద్ధం



ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సర్వం సిద్ధం చేశాం. సచివాలయ, మండలాల స్థాయిలో వారు భావించిన సమయంలో పోటీలు నిర్వహిస్తారు. అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే అన్ని స్థాయిలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయి. యాక్షన్ ప్లాన్ ప్రకారం సచివాలయ పరిధిలో నిర్వహించనున్న క్రీడలకు సంబంధించి క్రీడా సామగ్రి కూడా పంపిణీ చేశాం.

– పి.ప్రభాకరరెడ్డి, సీఈఓ, జిల్లాపరిషత్, చిత్తూరు

ఆనందాన్నిస్తోంది



గ్రామీణ ప్రజలను క్రీడల్లో ప్రోత్సహించడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం నాకు ఆనందాన్నిస్తోంది. నేను ఖోఖో క్రీడలో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నాను. 15 ఏళ్లు ఉన్న వారందరూ చదువుతో నిమిత్తం లేకుండా పోటీల్లో అర్హులు అని చెప్పడంతో నాకు అవకాశం దక్కింది. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఈ ప్రభుత్వం.. మానసిక సంతోషం కోసం క్రీడలను కూడా ప్రోత్సహించడం మరింత ఆనందంగా ఉంది.

– సి.రజిని కుమారి, బొమ్మసముద్రం, ఐరాల మండలం

పాతరోజులు గుర్తుకు వస్తున్నాయి



గతంలో పాఠశాల దశలో క్రీడలు ఆడేవాళ్లం. తర్వాత మనసుకు ఆహ్లాదపరిచే ఈ క్రీడల పోటీలు ఆడడానికి సమయం ఉండేది కాదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడలను గ్రామీణ స్థాయిలో నిర్వహిస్తుండడంతో నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. కబడ్డీ పోటీల్లో నాకు కొంత ప్రవేశం ఉంది. ఆసక్తి ఉండడంతో ఈ విభాగంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. మా సచివాలయ పరిధిలో 15వ తేదీ జరగనున్న క్రీడా పోటీల్లో పాల్గొననున్నాను. పోటీల్లో పాల్గొనబోతున్నానని తలచుకుంటే పాతరోజులు గుర్తొస్తున్నాయి.

– రోజ, ఎం.కొత్తూరు, గుడిపల్లి మండలం

నేడు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: కేంద్రబృందం (ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్) సభ్యులు ఈనెల 14వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బృందం సభ్యులు గురువారం జిల్లాలోని పలమనేరు, రామకుప్పం మండలాల్లో పర్యటిస్తారన్నారు. డీఏఎఫ్‌డబ్ల్యూ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలోని 10 మందితో కూడిన బృందం సభ్యులు జిల్లాలోని వేరుశనగ పంటను పరిశీలిస్తారన్నారు. ఉదయం 10.30 గంటలకు పలమనేరు మండలంలోని శ్రీరంగరాజపురం, గుండ్లపల్లె గ్రామాల్లో వేరుశనగ పంట పరిశీలిస్తారన్నారు. అనంతరం రామకుప్పం మండలంలోని గొర్రిమాకులపల్లె, బందార్లపల్లె గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడకు బయలుదేరి వెళతారని తెలిపారు. ఈ బృందంలో డీటీఈ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ హైదరాబాద్‌కు చెందిన మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ ఫార్మర్ వెల్ఫేర్ డైరెక్టర్ పొన్నుస్వామి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ డీడీ మహేశ్‌కుమార్, రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కైలాష్ సంక్లా, కృష్ణా–గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ దేవేంద్రరావు, ఎంఎన్‌సీఎఫ్‌సీ ఏడీ ప్రదీప్‌కుమార్, ఎస్‌టీఏ రీజినల్ ఫాండర్ స్టేషన్ డైరీయింగ్ అంజు బసెరా, నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బటాన, కేంద్ర జలశక్తి సభ్యులు సంతోష్, ఫుడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రటరీ సంగీత్ కుమార్ సభ్యులుగా ఉంటారని వెల్లడించారు.

వారంలోపు కసరత్తు పూర్తి చేయండి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : వారంలోపు ఓటర్ల జాబితా తయారీ కసరత్తు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జేసీలను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ ఓటర్ల జాబితా కసరత్తు అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా కసరత్తు చేపస్తున్నట్లు చెప్పారు. నిర్ధేశించిన గడువులోపు కసరత్తు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జంక్ క్యారెక్టర్‌లు, ఒకే ఇంటి నంబర్‌లో పదికి పైగా ఉన్న ఓటర్లను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామన్నారు. డీఆర్వో రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

16న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఈ నెల 16వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల) దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొనేందుకు విభిన్నప్రతిభావంతులైన ఉద్యోగులకు ప్రభుత్వం సాధారణ సెలవు మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని విభిన్నప్రతిభావంతులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మైనారిటీలకు అండగా జగనన్న సర్కారు

- సిఫార్సులు లేకుండా గడప వద్దకే సంక్షేమం
- ముస్లిం మైనారిటీలకు చేయూత
- మంత్రి ఆర్కేరోజా



సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా, చిన్నారిని ముద్దాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : మైనారిటీలకు అండగా జగనన్న సర్కారు నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపేటలో ముస్లిం మైనారిటీలు అధికంగా నివశించే 23, 24 వార్డుల్లో మంగళవారం మంత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఆమెకు ఆత్మీయ స్వాగతం పలికారు. స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ప్రతి గడపకూ వెళ్లి గత నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని గణాంకాలతో స్థానికులకు వివరించి, సంక్షేమ బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తనను సంప్రదించవచ్చని, ప్రజల కోసమే నగరిలో నివాసమేర్పరచుకున్నానని తెలిపారు. మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని, చల్లని ఫ్యానుగాలి లాంటి పాలనను కొనసాగించే జగనన్ననే మళ్లీ సీఎంని చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలందరినీ ఇంటికి పిలిచి రంజాన్ వేడుకలు నిర్వహించడంతోపాటు ప్రతి ముస్లిం ఇంటికీ విందు భోజనం పంపిన నేత మీరొక్కరే అంటూ మంత్రిని ప్రశంసించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ పాలనలో ముస్లింలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయూత అందిస్తున్నామన్నారు. గతంలో పాలించిన టీడీపీ నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపించేవారన్నారు. ఎన్నికల్లో చెప్పిన హామీలు తుంగలో తొక్కుతారని, అందుకే వారు మళ్లీ ఎన్నికలు వచ్చేవరకు ప్రజలకు కనిపించకుండా తిరిగేవారన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అలాకాదన్నారు. చెప్పిన ప్రతి హామీని తాము నెరవేర్చామని, ప్రతి గడపకూ లబ్ధి చేకూర్చామని, నిత్యం ప్రజల మధ్యే తిరుగుతున్నామన్నారు. పేదవాని ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నేతలు ప్రజలను ఏమార్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. వారి పాలనలో చేసిన అభివృద్ధి ఇది అని చెప్పుకునేందుకు ఏదీ లేదు కనుక మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లడం ద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వారి ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. మభ్యపెట్టేదెవరో, మంచి చేసేదెవరో ఆలోచిస్తే ప్రజలకే స్పష్టమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలరు బీడీ భాస్కర్, నాయకులు సలీం, సాధిక్, బషీర్, బాషా, జాకీర్, సలీం, శక్తివేలు రెడ్డి, శ్రీనివాసులు, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి మండపంలో మృత్యుఘోష!

- ఫ్లవర్ స్ప్రే సిలిండర్ పేలి బాలిక మృతి

పుత్తూరు: మంగళ వాయిద్యాలు, బంధువుల హడావుడితో కళకళలాడుతున్న కల్యాణ మండపంలో ఒక్కసారిగా పెద్దగా పేలుడు. దీంతో ఒక్కసారిగా కల్యాణ మండపంలో భయానక వాతావరణం.. ఏమి జరిగిందో తెలుసుకొనేలోపు ఓ బాలిక రక్తపుమడుగులో కనిపించింది. దీంతో కల్యాణమండపం మొత్తం ఒక్కసారిగా ఏడుపులు పెడబొబ్బలతో దద్దరిల్లిపోయింది. ఈ భయానక సంఘటన బుధవారం రాత్రి పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని జీవీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. పుత్తూరు మండలం దిగువ కృష్ణసముద్రం గ్రామానికి చెందిన పీడీ గుణశేఖర్ నారాయణవనం మండలం కళింమిట్టలో నివాసం ఉంటున్నాడు. తన భార్య మీనాకు సమీప బంధువుల వివాహానికి తన కుమార్తె చాందిని(14)తో కలిసి ముగ్గురు వచ్చారు. పెళ్లి సందడిలో ఫ్లవర్ ఎక్స్‌పోజర్ మిషన్‌కు అమర్చిన సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న చాందిని తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో చాందినీని వెంటనే పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చాందిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా మృతురాలు నారాయణవనం బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కల్యాణమండపంలో సంఘటన స్థలం, ఇన్‌సెట్ చాందిని మృతదేహం

క్లుప్తంగా

మెరుగైన సేవలందించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్బరాజు

పుత్తూరు: వినియోగదారులకు విద్యుత్‌శాఖ సిబ్బంది మెరుగైన సేవలందించాలని తిరుపతి జిల్లా సబ్‌స్టేషన్ల టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్. సుబ్బరాజు సూచించారు. బుధవారం ఆయన వడమాలపేట మండలంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ ఛార్జీల వసూలుతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రకృతి విపత్తు సమయాల్లో మరింత అప్రమత్తంగా విధులను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ ఇంజినీర్లు ఎం.చిన్నారెడ్డి, టి.శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల దాడి.. ధాన్యం ధ్వంసం



ఏనుగుల దాడిలో చెల్లా చెదురైన ధాన్యం

పెద్దపంజాణి: మండలంలోని ఆకులవారిపల్లె మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు ధాన్యం ధ్వంసం చేశాయి. బాధితుల కథనం మేరకు.. కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు ఆకులవారిపల్లెకు చెందిన రైతులు బయ్యారెడ్డి, శ్రీరాములు రెడ్డి, నగేష్ రెడ్డి, లింగారెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, వెంకట్రమణ తమ పొలం వద్ద ఆరబోసిన వడ్లను సగం తిని, మిగిలిన సగాన్ని చెల్లాచెదురు చేసి, తీవ్ర నష్టం కలిగించాయి. చేతికొచ్చిన పంట ఏనుగుల కారణంగా నష్టపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పొలాలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధ్రువపత్రం.. ఉపయోగకరం

భవితకు ఆదాయ, కుల ధ్రువపత్రం అవసరం. అవి పొందడం గతంలో బహు కష్టం.. ప్రస్తుతం అర్హతే ప్రామాణికం.. కుల,మత, పార్టీలకతీతంగా పల్లె ముంగిటే లభ్యం. వెరసి ఆ పత్రం ఎంతో ఉపయోగకరం. ఇదంతా జగనన్న సురక్షతోనే సాధ్యం. ఫలితం లబ్ధిదారులకు సంతోషం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో జిల్లాలోని లక్షలాది మంది పేదలకు మేలు చేకూరింది. ఈ కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు



తవణంపల్లె మండలంలో నిర్వహించిన క్యాంపులో లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న అధికారులు

కులధ్రువీకరణ పత్రం అందింది



నా కుమార్తె రేష్మకు బీటెక్ చదువు నిమిత్తం కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. ఎలా దరఖాస్తు చేసుకోవాలని పలువురిని విచారిస్తుండగా అదే సమయంలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. సర్టిఫికెట్లు ఏమైనా కావాలా అని వలంటీర్ ఇంటివద్దకే వచ్చారు. నాకు కుల ధ్రువీకరణ పత్రం కావాలని చెప్పాను. వారం రోజుల్లోనే మా గ్రామంలో పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా చేతుల మీదుగా నాకు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఎలాంటి కష్టాలు లేకుండా నాకు సర్టిఫికెట్ అందింది.

-ఎస్.కవిత, ముడిపల్లె, నగరి మండలం

సులువుగా సర్టిఫికెట్



ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా సులువుగా సర్టిఫికెట్ అందింది. లీగల్ హైర్ సర్టిఫికెట్ పొందాలంటే గతంలో చాలా సమస్యలుండేవి. ఆ సర్టిఫికెట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాము. ఆ సర్టిఫికెట్ పొందడం కుదరలేదు. ఆ సర్టిఫికెట్ మాకు చాలా ముఖ్యం అయినా పొందలేకపోయాం. జగనన్న పుణ్యమా అని సురక్ష క్యాంపు మా ఊర్లో నిర్వహించారు. ఆ క్యాంపునకు ముందస్తుగా అవసరమైన వివరాలను వలంటీర్‌కు ఇచ్చామంతే.. కొద్ది రోజుల్లోనే సర్టిఫికెట్‌ను మా ఊర్లో నిర్వహించిన శిబిరంలోనే ఇచ్చారు.

- ఇంద్రాణి, మఠవలం, గృహిణి.

ప్రభుత్వ సాయం మరువలేం



మాది మధ్యతరగతి కుటుంబం. చిరు వ్యాపారం చేసుకుని జీవనం కొనసాగిస్తుంటాం. మాకు ఆరోగ్య శ్రీ కార్డు ఎంతో ముఖ్యం. ఆ కార్డు లేనందున చాలా సమస్యలు ఎదుర్కొన్నాం. చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జగనన్న సురక్ష క్యాంపులో చాలా రోజులుగా మంజూరు కాని ఆరోగ్యశ్రీ కార్డును ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం చేస్తున్న సహాయం మరిచిపోలేము. సీఎం జగనన్నకు మా కుటుంబం అంతా రుణపడి ఉంటాము.

- మసూహత్, కాజీపేట, వి.కోట మండలం

12 రకాల సర్టిఫికెట్లు ఇచ్చారు



మా కుటుంబంలో ఎవరికి ఎప్పుడు ఏ సర్టిఫికెట్లు అవసరమవుతాయో తెలియని పరిస్థితి. అవసరమైన సర్టిఫికెట్లు సమయానికి దొరకక చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. ముఖ్యంగా కుల,ఆదాయ, ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ముడుపులు ఇస్తే గాని సర్టిఫికెట్లు ఇచ్చేవారు కాదు. అలాంటిది ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం నిర్వహించిన సురక్ష క్యాంపులో మా కుటుంబానికి అవసరమైన 12 రకాల సర్టిఫికెట్లను అధికారులు ఇంటివద్దకే వచ్చి ఇచ్చారు. సీఎం పరిపాలన చాలా బాగుంది.

- చంద్రకళ, లబ్ధిదారు, కుప్పం

ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం



సంఘీభావం తెలుపుతున్న నేతలు, ఇన్‌సెట్ మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి

కుప్పం: నియోజకవర్గంలో అగ్రస్థానంలో ఉన్న వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం ఆత్మగౌరవం కాపాడుకునే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం సామగుట్టపల్లె వద్ద ఉన్న ఎంఎం మహల్‌లో నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వన్నెకుల క్షత్రియ కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నియోజకవర్గంలో మొదటి స్థానంలో ఉన్న క్షత్రియులు శాసించే స్థాయిలో ఉండాల్సిన వారు ఎవరి న్యాయకత్వం వద్దనో పనిచేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బానిస బతుకులకు స్వస్తి పలికి, మన నాయకత్వాన్ని బలపరుచుకోవాలన్నారు. 2014 ఎన్నికల్లో రాజకీయ అనుభవం లేకపోయినా.. మా నాన్న చంద్రమౌళి ఐఏఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ చేసి, తన సామాజిక వర్గం కోసం కుప్పానికి వచ్చారన్నారు. ఆయన రెండుసార్లు కుప్పంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారని చెప్పారు. పదేళ్ల పాటు కుప్పంలో కష్టపడి ప్రజా సేవ చేసి, అనారోగ్యంలో మృతి చెందారని, ఆయన ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. కుప్పంలోని క్షత్రియులను అభివృద్ధి చేసేందుకు నిరంతరం పనిచేస్తున్నానని చెప్పారు. 35 ఏళ్ల ఒక పార్టీకి ఊడిగం చేశామని, ఇకపై వద్దని చెప్పారు. ఐదేళ్లుగా తన దగ్గరకు వచ్చిన వారందరికీ మంచి చేశానని, తెలిసో తెలియక తన కారణంగా బాధ కలిగి ఉంటే క్షమించి, ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తాను గెలిచిన తరువాత భరత్‌కు ఓటు వేశాం.. అయన ఒక పని కూడా సక్రమంగా చేయడం లేదు, మన ఓటు వృథా అయిందని మీరు భావిస్తే, అప్పుడే రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు.

ఇప్పటికైనా మేల్కొండి

టీడీపీలో ఏళ్ల తరబడి పనిచేశాను... అక్కడ మనల్ని ఉపయోగించుకుని వారేకానీ మనకు ఏమి చేయలేదని. ఇప్పటికైనా కుప్పంలో వన్నకుల క్షత్రియులు మేల్కోవాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. వన్నకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన భరత్ మీకు అండగా ఉంటారని, ఆయన్ని ఆదరించాలన్నారు. ఏళ్ల తరబడిగా చంద్రబాబును చూసి మోసం పోయారని, ఇంకా ఎన్నాళ్లు మోసపోతారని, ఇప్పటికైనా మీలో మార్పురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంఘం చైర్‌పర్సన్ వనిత, చిత్తూరు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వన్నెకుల క్షత్రియ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌండర్, కుల సంఘ నాయకులు మురుగేష్, శరవణ, రంగయ్య, రామమూర్తి, విజయ్‌కుమార్, సీసీ మనోహర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరిపై రాద్ధాంతమా?

కుప్పం: స్థానిక కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో రూ.కోటి మేరకు రుణాలు రికవరీ కావాల్సి ఉందని, తీసుకున్న రుణాన్ని చెల్లించమంటే రాద్ధాంతం చేస్తునారని టౌన్ బ్యాంక్ మేనేజర్ భాగ్యరాజ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.3 కోట్ల పాల బకాయిలును రెండేళ్లలో రూ.2 కోట్ల వరకు రికవరీ చేశామన్నారు. ఇంకా రూ.కోటి వసూలు కావాల్సి ఉందని, ఇందుకోసం రికవరీకి బ్యాంక్ సిబ్బంది వెళితే కొందరు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడిగా హౌసింగ్ బకాయిలు పేరుకుపోవడంతో రెండేళ్లుగా ఆర్బీఐ నిబంధనల మేరకు హౌసింగ్ రుణాలు నిలిపేసినట్లు తెలిపారు. ఇప్పటికి రూ.కోటి వసూలు కావాల్సి ఉందన్నారు. ఏళ్ల తరబడిగా పేరుకుపోయినా రుణ బకాయిలను చెల్లించాలని నోటీసు ఇచ్చామని చెప్పారు. అప్పటికీ స్పందించకపోవడంలో సిబ్బంది నేరుగా వెళ్లి రుణాలు చెల్లించాలని కోరుతున్నా ఫలితం లేదన్నారు. రికవరీ కోసం వెళ్లిన సిబ్బందిపై నిందలు, ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టౌన్‌బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మార్కొండయ్య (58) అనే వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. చిత్తూరు వన్ టౌన్ ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు.. కొంగారెడ్డిపల్లెలోని సత్యనారాయణపురానికి చెందిన మార్కొండయ్య దర్జీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో చిన్నపాటి గొడవ రావడంతో మనస్తాపం చెందిన మార్కొండయ్య సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు

16న గంగవరంలో శ్రీవారి కల్యాణం

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని సాయిబాబ గుడి వద్ద ఉన్న మైదానంలో టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కు సంబంధించిన పోస్టర్లను తిరుమలో ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి ఆవిష్కరించారు. కల్యాణోత్సవం జరిగే ప్రాంగణంలో ఏర్పాట్లను టీటీడీ సిబ్బంది ఇది వరకే ముమ్మరం చేసింది. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్టీ నేతలతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగవరంలో శ్రీవారి కల్యాణోత్సవం మొదటిసారి వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవంలో దాదాపు పదివేల మందికి పైగా పాల్గొని, స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించే వెసులుబాటును కల్పిస్తున్నట్టు తెలిపారు. కల్యాణోత్సవ సమయంలో ఎలాంటి ఘటనలు, భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తిరుమలకు వెళ్లి స్వామివారి కల్యాణోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం వీలుకాదని, అందుకే ఆ దేవదేవుని కల్యాణం మన కళ్ల ముందే నిర్వహించే భాగ్యం దేవుడు మనందరికీ ప్రసాదించారన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ శ్రీవారి కల్యాణోత్సవంలో సంప్రదాయ దుస్తులతో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్లు మోహన్‌రెడ్డి, బాగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పలమనేరు పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధ, ఏరియా ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఎంపీపీలు రెడ్డెప్ప, యువరాజు, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ముజ్జు, నరేష్, తదితరులు ఉన్నారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు
ఘనంగా నిర్వహించండి



వారోత్సవాల బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని చెప్పారు. ఇంధన పొదుపుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి



వెంకయ్య మృతదేహం

పుత్తూరు: కూలి పనికి వెళ్లిన ఓ యువకుడు కరెంట్‌షాక్ గురై మృతి చెందిన సంఘటన వడమాలపేటలో చోటు చేసుకొంది. ట్రైనీ డీఎస్పీ సింధూప్రియ కథనం మేరకు.. రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లె గ్రామానికి చెందిన ఎం.వెంకయ్య (22) అనే యువకుడు వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ వెంచర్‌లో మంగళవారం కూలి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇనుప పైపును తీసుకెళుతుండగా హై ఓల్టేజీ విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు



విక్రేతను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తీసుకెళుతున్న వంశీ (27) అనే నిందితుడిని చిత్తూరు టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ప్రశాంత్‌నగర్ వద్ద ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా సంతపేటకు చెందిన వంశీ తన ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. అతడిని తనిఖీ చేయగా 190 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. నిందితున్ని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైంగిక వేధింపులపై పోక్సో కేసు

చంద్రగిరి : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు మైనర్లతో పాటు ఓ యువకుడిపై పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. వివరాలు.. చంద్రగిరికి చెందిన బాలిక ఈ నెల 8వ తేదీన అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలికతోపాటు ఇద్దరు మైనర్ బాలురు, ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు పోక్సో యాక్ట్ కిందకు మార్చి నమోదు చేశారు.

ముస్లింల గుండెల్లో జగన్



ఎంపీ మిథున్‌రెడ్డి, ఖాదర్‌బాషా చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఫక్రుద్దిన్‌షరీఫ్

పుంగనూరు: ముస్లిం మైనారిటీల హృదయాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వతంగా నిలిచిపోయారని సీమ జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ షరీఫ్ కొనియాడారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీమ జిల్లాలో హర్‌దిల్‌మే వైఎస్సార్–హం సబ్ జగన్‌కే షాద్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించామన్నారు. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనకు ప్రశంసాపత్రాన్ని ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఖాదర్‌బాషా చేతులు మీదుగా అందించడం ఎంతో సంతోషకరమన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మైనారిటీలకు రాజకీయ పదవులు రాకుండా చేసేందుకు ఎంతో మంది కుట్రలు చేశారని, కానీ వాటిని లెక్కచేయకుండా మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి మైనారిటీలకు మున్సిపల్ చైర్మన్ పదవితోపాటు వివిధ రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చి, వారి అభ్యున్నతికి దోహదం చేశారని కొనియాడారు. రాష్ట్రంలో ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి జగనన్న మైనారిటీలను ఆదుకుంటే, పుంగనూరు నియోజకవర్గంలో మిథునన్న మైనారిటీల అభ్యున్నతికి రూ.కోట్లు సొంత నిధులు పంపిణీ చేస్తున్నారని స్పష్టం చేశారు. మైనారిటీల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న పెద్దిరెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, మైనారిటీల మద్దతు వైఎస్సార్‌సీపీకేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జావీద్, అంజాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని ఒకరి మృతి



చంద్రప్ప(ఫైల్)

వి.కోట: టోల్ గేటు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని ఓ ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని శీకార్లపల్లెకు చెందిన వెంకట రామప్ప కుమారుడు చంద్రప్ప(51) వి.కోట పట్టణం నుంచి రాత్రి సమయంలో తన ద్విచక్రవాహనంలో తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వి.కోట–పలమనేరు జాతీయరహదారిలోని టోల్ గేటు వద్ద ప్రమాదవశాత్తు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని, గాయపడ్డాడు. ఈ విషయం గుర్తించిన స్థానికులు క్షతగాత్రుడిని వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చంద్రప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్య కేసులో ఆరుగురికి రిమాండ్

నాగలాపురం: మండలంలోని పశ్చిమ దళితవాడకు చెందిన నిషా(23) అనే వివాహిత కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో నిషా భర్తతోపాటు కుటుంబీకులు కాలియమ్మ, మెరీనా, దేవేంద్రన్, అకిష, సబితను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం నిందితులను తిరుపతి సబ్‌జైలుకు తరలించారు.

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పేరొందిన మూడు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 3వేలకు పైబలుకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకామ్, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ అర్హత గల నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్‌పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ, క్వెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిక్సన్(టీవీ మాన్యుఫాక్చరింగ్) అసెంబ్లీ ఆపరేటర్, క్వాలిటీ కంట్రోల్ రోల్, గ్లోబల్ భారత్ హెచ్‌ఆర్ సొల్యూషన్, వాయిస్ బీపీవో, క్రెడిట్ కార్డ్ సేల్స్, ఫ్లిప్ కార్డ్ డెలివరీ బాయ్స్ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పాస్ లేదా ఫెయిల్ అయిన వారు 18–30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని, ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.20వేల వరకు జీతం, అదనపు ప్రయోజనాలు, ఉచిత రవాణా, షిఫ్ట్ సమయంలో ఉచిత ఆహారం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్, పాన్‌కార్డు/ఓటర్ కార్డు (ఒరిజినల్, జెరాక్స్), బయోడేటా రెండు సెట్లు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో శుక్రవారం ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు రేణిగుంట విమానాశ్రయం సమీపంలో, శ్రీకాళహస్తి, ఏర్పేడు, తిరుపతి, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కోసం 9440502338, 7981473129 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.